# పప్పులో కాలు - కప్పులో పాలు

"ఏమండోయ్ త్వరగా వచ్చేసెయ్యండి" కేక పెట్టింది నా శ్రీమతి.

"అలాగే" అంటూ ప్లాస్టిక్ సంచి చిన్నదిగా మడిచి జేబులో పెట్టుకుని బస్టాప్ వైపు నడిచాను.

నేను మామూలుగా రెండు మైళ్ళ దూరంలో వున్న పెద్ద మార్కెట్‌కి ఎప్పుడూ సైకిల్ మీదనే పోతుంటాను. కాని ఉదయం సైకిలు పంచరయినందువలన ఈ రోజు బస్సులో వెళ్ళాల్సొచ్చింది.

దూరం నించి బస్సు వస్తోంది. జేబు తడుముకున్నాను. జేబులో ఇరవై రూపాయిల నోటుంది. ప్రస్తుతం దేశంలో చిల్లర కొరత తీవ్రంగా వుంది. బస్సులో ఎక్కితే చిల్లర కావాలంటారు. మార్కెట్‌కి వెళితే చిల్లర లేదంటారు. ఇక హోటళ్లో సరేసరి. బిల్లు కౌంటర్లో ఇచ్చి అరగంట నిలబడితే గాని చిల్లర ఇవ్వరు, ఇప్పుడు అదీ పదిపైసలో. ఇరవై పైసలో తగ్గించి.

బస్సు ఝూమ్మంటూ వచ్చి అలవాటు ప్రకారం స్టాపు దాటి యాభై గజాల అవతల ఆగింది. వీటితో బాగా ఎక్స్‌పీరియన్స్ వున్న ప్రయాణీకులు స్టాపుకు అవతలే నిలబడిఉన్నారు. నాలాంటి వాళ్ళు బస్టాప్‌లోనే నిలబడి వున్నారు. ఎలాగైతేనేం అందరూ బస్సుమీద దాడిచేశారు. యుద్ధ భూమిలో విజయం సాధించినంత ఆనందంగా దూరాను.

"టికెట్... టికెట్" వస్తున్నాడు కండెక్టర్.

"మార్కెట్..." అంటూ ఇరవై రూపాయిల నోటు అందించాను.

"ఏమిటి సార్ ఇది యాభై పైసలకు ఇరవై రూపాయల కాగితమా. ఇలా అయితే ఇక అయినట్లే" అంటూ ఇరవై రూపాయిల నోటు తిరిగి చేతిలో పెట్టబోయాడు.

నేను దాన్ని తీసుకోలేదు, పైపెచ్చు చిల్లరమీదున్న ఏహ్యాభావాన్ని నాలుగు మాటల్లో అడిగేశాను.

"ఏమయ్యా అందర్నీ చిల్లరివ్వండి, చిల్లరివ్వండి అని అడుగుతున్నావు. ఏం చేసుకుంటావు చిల్లర్ని. ఏమయినా చిల్లర కమీషన్ వ్యాపారం పెట్టావా. అందరూ చిల్లర ఎక్కడతెస్తారయ్యా? చిల్లర ఇచ్చిన వాళ్ళ దగ్గర తీసుకోవాలి, నోట్లు ఇచ్చిన వాళ్ళకు చిల్లరివ్వాలి. అదీ పద్ధతి" అన్నాను.

బస్సులో వాళ్లంతా నావైపు మెచ్చుకోలుగా చూశారు. కండక్టరు ఇక వాదించి లాభం లేదనుకున్నాడు కాబోలు.

"సార్ మీకు చిల్లర దిగేటప్పుడు ఇస్తాను" అన్నాడు, ప్రాధేయపూర్వకంగా.

నేను కూడా కూల్ అయిపోయాను "దానికి నేను కాదనడం లేదుగా" అన్నాను.

బస్సు మొదటి స్టేజీ దాటి రెండవ స్టేజీ మార్కెట్ దగ్గర ఆగింది. దిగుతూ "ఛేంజ్" అన్నాను.

"ఇదుగోండి సార్ పంతొమ్మిది రూపాయలా యాభై పైసలు" అంటూ ఒక పదినోటు, ఒక అయిదునోటు, రెండు రూపాయినోట్లు, యాభై పైసల చిల్లర నాచేతిలో పెట్టాడు.

నేను ఆ డబ్బు అందుకొని జేబులో పెట్టుకుని గర్వంగా నవ్వుకొంటూ మార్కెట్ గేటు దగ్గరకు వచ్చాను. మారని నోటు మార్చినందుకు నాకు గర్వంగా ఉంది. దాన్ని ఎవడో అంతకు ముందు నా కంటగట్టాడు.

ఇంతలో మార్కెట్‌లోంచి కూరగాయల సంచీ పట్టుకొని వస్తున్న నా మిత్రద్వయం నన్ను చుట్టుముట్టారు.

"ఏరా నిన్న ఇంక్రిమెంటు అరియర్స్ డ్రా చేసి సెక్షన్‌లో టీ కూడా ఇప్పించకుండా వచ్చేస్తావా" అన్నాడు ఆనంద్.

"పోనీరా, వాళ్ళని వదిలేస్తే వదిలావు, ఇంపార్టెంట్ ఫ్రెండ్స్‌మయిన మమ్మల్ని కూడా మోసగించడం బాగాలేదు, ఇప్పటికైనా మించి పోయింది లేదు. పద పోదాం" అన్నాడు దగ్గరలో వున్న క్యాంటీన్ వైపుదారి తీస్తూ భాస్కర్.

"ఒరేయ్ ఇప్పుడు డబ్బులెక్కడివిరా, అయినా వర్షమొచ్చినా, ఎండకాసినా, జలుబు చేసినా, షేవింగుచేసుకొన్నా మీకు పార్టీలు ఎక్కడ ఇచ్చేది" అన్నాను విసుగ్గా.

"నోర్మూసుకోరా, నీవో దానకర్ణుడవు, దయార్ధహృదయుడవు, అందమైన అమ్మాయిల అంతరంగ హృదయుడవు, స్టెనో సుకుమారి నుంచి ఆఫీసర్ అనూరాధ వరకు నీ చేత వలపింపబడ్డవాళ్ళే. ఇంత అదృష్ట జాతకుడివి ఇంత చీప్ బుద్దేందిరా" అన్నాడు భాస్కర్. వాడు నా ఆయువు పట్టుమీద కొట్టాడు, నా బలహీనతను హిప్నటైజ్ చేశాడు. నేను నాకు తెలియకుండానే గర్వంతో ఉబ్బిపోయాను.

"ఒరేయ్ ఆంజనేయుడి తోకలా పెరిగిపోయే ఈ విజయవాడ పట్టణంలో శ్రీకృష్ణుడి విశ్వరూపానివిరా నువ్వు" అంటూ పొగిడిపారేశాడు ఆనంద్.

అంతే...ముగ్గురమూ దగ్గర్లో ఉన్న క్యాంటీన్‌లో దూరాము.

కూర్చుంటూనే "మూడు ఆమ్లెట్" అంటూ అరిచాడు ఆనంద్.

"సింగిల్" అన్నాను నేను.

"సింగిలే లేరా. బోడి డబుల్ ఇప్పిస్తానని మేమనుకొన్నామా" అన్నాడు.

భాస్కర్ వెంటనే లేచాడు "ఇప్పుడే వస్తా" అంటూ లోపలికి వెళ్ళాడు. లోపలికి వెళ్లి పదినిమిషాల్లో ముఖం కడుక్కొని వచ్చాడు.

"ఆమ్లెట్ చెబుతారనుకోలేదురా. అందుకే ముఖం కడుక్కొని వచ్చాను" అన్నాడు నిద్రలేచి నేరుగా వచ్చినందుకు బాధపడుతూ.

నేను వాడివైపు "ఏడ్చావులే" అన్నట్లు చూశాను.

వాడు నావైపు ఏడవడంగాదు, టిఫిన్ ఫ్రీగా ఇచ్చేవాళ్ళుంటే ఏడు మైళ్లయినా నడిచి వస్తా అన్నట్లు చూశాడు.

ఇంతలో మూడు ఆమ్లెట్లు వచ్చాయి. నన్ను మభ్యపెట్టి ఆ మాటా ఈ మాటా మాట్లాడుతూ నాకు బాధ కలుగకుండా చూస్తున్నారు.

ఆమ్లెట్లు తినడం పూర్తి కాగానే "మూడుకప్పుల పాలు" అని అరిచాడు.

"టీ త్రాగరా" అన్నాను.

"టీ ఎప్పుడో ఉదయాన్నే తాగడం అయిపోయింది. ఆమ్లెట్ లాంటి విటమినైజ్‌డ్ ఫుడ్ తిన్నప్పుడు పాలులాంటి పౌష్టికాహారం తీసుకోవాలోయ్" అంటూ నన్ను సున్నితంగా మందలించాడు.

ఇంతలో మూడు కప్పుల్లో పాలు వచ్చాయి. నన్ను మరోసారి పొగుడుతూ వాళ్ళిద్దరూ పాలు సేవించారు. వాళ్లతో పాటు నేనూ.

సర్వర్ బిల్లు నేరుగా నాముందు టేబుల్ మీద అద్దాడు. ఏ దశాబ్దంలో తుడిచారో తెలియదుకాని ఆ టేబుల్ మీదున్న జిడ్డుకు బిల్లు ఫెవికోల్ కంటే గట్టిగా అతుక్కుపోయింది. మూడు ఆమ్లెట్లు మూడు రెళ్ళ ఆరు. మూడు కప్పుల పాలు మూడు రూపాయలు మొత్తం తొమ్మిది రూపాయల బిల్లు.

నాగుండె దడదడ లాడిపోయింది. మొత్తం నా దగ్గరున్న పందొమ్మిది రూపాయలా యాభై పైసల్లో తొమ్మిది పోతే మిగిలేది పది యాభై పైసలు మాత్రమే. రెండు రోజులకు సరిపడా శ్రీమతి రాసిచ్చిన ఆరు అయిటమ్స్‌లో చివరి మూడు అయిటమ్స్ మాత్రమే తీసుకొని పోగలను.

ఇంకా ఆలస్యం చేస్తే సిగిరెట్, వక్కపొడి లాంటి వాటిని కూడా ఇప్పించాల్సి వస్తుందనే నమ్మకముండడంతో వెంటనే బిల్లు తీసుకుని కౌంటర్ దగ్గరికి నడిచాను. కౌంటర్ దగ్గర బిల్లు పడేసి పది రూపాయిల నోటు టేబుల్ మీద పడేశాను.

కౌంటర్ దగ్గర వ్యక్తిఆ నోటును అటూ, ఇటూ ఒకసారి తిప్పిచూసి "ఇదిచెల్లదు" అంటూ నా ముందుకు నెట్టాడు.

"ఏం" అన్నాను.

"చూడండి మీకే తెలుస్తుంది" అన్నాడు.

పది రూపాయిల నోటు మధ్యకు రెండుగా చీలిపోయి ఉంది. ఎవరో సకల కళావల్లభుడు ఆ చిరుగు ఏమాత్రం కనిపించకుండా ప్లాస్టిక్ కాగితంతో అంటించి ఉన్నాడు. మిగతా చిల్లర చూసుకున్నాను. అయిదు రూపాయిల నోటుకు మధ్యలో బంగాళాఖాతం మధ్య ఏర్పడిన సుడిగుండంలా పది పైసల బిళ్ళంత వెడల్పున పెద్ద కన్నం ఏర్పడిఉంది.

మిగతా రెండు రూపాయల నోట్లు మడతలు విప్పితే ఏ మడత కామడత స్వేచ్ఛజీవులయ్యేట్లు ఉన్నాయి.

నా గుండె ధన్‌మంది. నేను బస్సు కండక్టర్ దగ్గర ఇరవై రూపాయలకు చిల్లర అవలీలగా సంపాదించానని ఆనందించానేగాని, ఇంత దారుణంగా మోసపోతానను కోలేదు. ఇప్పుడెలా ఈ బిల్లు చెల్లించడం? కౌంటర్లోని వ్యక్తి వేరే బిల్లులు అందుకుని డబ్బు తీసుకుంటున్నాడు.

నా ఫ్రెండ్స్ దగ్గర ఖచ్చితంగా డబ్బులుండవు. కారణం మార్కెట్ పని చేసుకుని తిరిగి వస్తున్నారు కనుక. వాళ్ల నడిగి లేదనిపించుకోవడమేగాక ఎంత అవమానం. వాళ్ళని ఈ సందర్భంలో అడగడం అసహ్యంగా వుంటుంది.

ఇప్పుడు ఆపదలోంచి బయటపడడానికి రెండే రెండు మార్గాలున్నాయి. ఒకటి వాచీ విప్పి టేబుల్ మీదయినా పెట్టాలి. లేదా చొక్కా విప్పి ఎంగిలి ప్లేట్లు, కప్పులన్నా కడగాలి. క్యాషియర్ మొదటిది దానికి ఒప్పుకోకపోయినా రెండో దానికి తప్పకుండా ఒప్పుకుంటాడు.

నేను నా ఫ్రెండ్స్ వైపు చూశాను. ఇద్దరూ కూర్చుని నవ్వుకుంటూ మళయాలం సినిమాలోని ఒక సీన్ గురించి దీర్ఘంగా చర్చించుకుంటున్నారు. నేను బిల్లు చెల్లించి బయటపడితే నావెనుకాలే రావాలని చూస్తున్నారు. “అనవరంగా వీళ్ళకి కప్పుల్లో పాలిప్పించి, నేను పప్పులో కాలేశాను గదరా దేవుడా!” అనుకుంటున్నాను.

ఒకరొకరుగా అందరూ బిల్లు చెల్లించి పోతున్నా నేను అలాగే నిలబడి ఉండడం చాలా మందికి అనుమానం తెప్పిస్తూ వుంది. మెరుపులాంటి ఆలోచనలు ఎన్నో తళుక్కున మెరిసి మాయమైపోతున్నాయి గాని ఏదీ సూటు కావడం లేదు. ఆ ఆలోచనలు ఎటువంటివి అంటే ఒక్కసారి జనంలో కలిసి పరుగెత్తుకు పారిపోవడం, లేదా చప్పున క్యాషియర్ రెండు చేతులు పట్టుకుని “బాబూ, ఇవి చేతులు కాదు, కాళ్ళనుకో” అనడం వంటివి కూడా వున్నాయి.

ఇంతలో నా అదృష్టం బాగుండి రోడ్డుమీద పోతూ కనిపించాడు నా చిరకాల మిత్రుడు విశ్వం. అతను నా ఫ్రెండేకాక దూరపు బంధువు కూడా.

“హలో!” అంటూ చేయి పైకెత్తి రోడ్డు క్రాస్ చేసి హోటల్లోకి వచ్చాడు. ఇద్దరం మళ్లీ లోపలికి నడిచాము. “మాకు పనుంది, మేం వెళ్తాంరా!” అన్నారు నా స్నేహితులు.

“సరే వెళ్లండిరా, మీ పని అయిపోయిందిగా!” అన్నాను వంకరగా నవ్వుతూ. వాళ్ళు క్యాష్ కౌంటర్ దగ్గర కొచ్చేసరికి నేను క్యాషియర్ వైపు చెయ్యెత్తి సంజ్ఞ చేశాను బిల్లు నేను చెల్లిస్తానని.

వాళ్ళు వెళ్ళిపోయిన తరువాత మిత్రుణ్ణి పలకరించాను.

"ఏమోయ్ ప్రమోషన్ వచ్చిన తరువాత కనిపించలేదు, పార్టీ ఇవ్వబడుతుందనా?" అన్నాను.

అతనికి ఈ మధ్యనే జూనియర్ లెక్చరర్ నుండి సీనియర్ లెక్చరరుకు ప్రమోషన్ వచ్చింది.

"అదేం కాదురా, వీల్లేక కలుసుకోలేకపోయాను. ఐయామ్ సారీ!" అన్నాడు.

"రెండు టీ" ఆర్డరిచ్చాను.

"టీ కాదు ఇంకేమైనా తీసుకో, తర్వాత టీ తీసుకుందాం" అన్నాడు విశ్వం.

"నే నిప్పుడే ఆమ్లెట్ తిన్నాను, ఆమ్లెట్‌కు ఆర్డరివ్వమంటావా?" అన్నాను, ఎలా నా బిల్లు డిస్పోజ్ చెయ్యాలా అని ఉపాయం ఆలోచిస్తూ.

"అబ్బే నాకొద్దు, నేను నీకోసమే చెప్పాను."

"అలా అయితే టీతో సరిపెట్టుకుందాం." అన్నాను. ఇంతలో సర్వరు రెండు కప్పుల్తో టీ తీసుకొచ్చి మా ఎదురుగా పెట్టాడు. నేను నా పాత బిల్లు అతని చేతికిచ్చి "రెండూ బిల్లులూ కలిపి ఒకటిగా వెయ్" అన్నాను. ఎక్కణ్ణుంచి వచ్చిందో ఆ మొండి ధైర్యం. ఒకవేళ విశ్వం బిల్లు తీసుకోకపోతే అడిషనల్‌గా నా మీద రెండు రూపాయల భారం పడ్డట్లే.

సర్వరు అది తీసుకుని వెళ్ళిపోయాడు. నేను మాట్లాడుతూనే ఆలోచిస్తున్నాను. ఆలోచిస్తుండగానే వచ్చాడు సర్వర్. కొత్త బిల్లు మొత్తం పదకొండు రూపాయలు.

ఇద్దరి మధ్యా ఉన్న బిల్లు ఆశగా మావైపు చూస్తోంది. విశ్వం ఏదేదో మాట్లాడేస్తున్నాడు. 'వాడు దీని సంగతి పట్టించుకోడేం' అని బిల్లు వైపు క్రీగంట చూస్తూ మాట్లాడుతున్నాను. బిల్లుకు నిజంగా ప్రాణమే ఉంటే నా అవస్థ చూళ్లేక విశ్వంవైపు జరిగిపోయేది. అంత బాధాకరంగా ఉన్నాయి నా చూపులు.

చివరకు ఒకటి నిర్ణయించుకున్నాను. బిల్లు నేనే ఇవ్వాల్సి వస్తే విశ్వానికి పరిస్థితి చెప్పి డబ్బు అడిగి తీసుకుంటాను. ఇప్పటికే ఆలస్యమైంది. ఇంకా ఆలస్యమైతే ఇటు కొంపలోను, అటు ఆఫీసులోను అక్షింతలు తప్పవు.

ఇక నేనే లేచి నిలబడి "పద విశ్వం వెళ్దాం, నాకు మార్కెట్లో కొద్దిగా పనుంది" అంటూ బిల్లు చేతిలో తీసుకున్నాను.

నాకు నిరాశ పుట్టింది, వాడు 'నే నిస్తా'నని తీసుకుంటాడుకున్నాను. కానీ అది జరగలేదు. అంతా సర్వనాశనం. వేసుకున్న ప్లాన్ ఎదురు తిరిగింది. అదృష్ట వశాత్తు దొరికిన పిట్ట రెక్కలాడించుకుంటూ ఎగిరి పోయింది. ఇప్పటికే క్యాషియర్ దగ్గర ఒకసారి అవమానం, ఇది రెండవసారి అవమానం. ఏడుపు ముఖం పెట్టుకుని విశ్వం వెనుకనే బిల్లు పట్టుకుని కౌంటర్ దగ్గరకు నడిచాను.

నేను బిల్లు టేబులు మీద పెట్టగానే ఎండిపోయిన నా ఆశావృక్షాన్ని చిగురింపచేస్తూ చప్పున బిల్లుమీద ఇరవై రూపాయలు నోటు పెట్టాడు విశ్వం. నా ముఖం వికసించింది. "ఎందుకులేరా!" అంటే మళ్లీ నోటు జేబులో పెట్టుకుంటాడని బిల్లుని, వాడి ఇరవై రూపాయల నోటుని, వాడిని అలాగే వదిలేసి వచ్చి రోడ్లో నిలబడ్డాను.

వాడు వచ్చిన తర్వాత "చాలా థ్యాంక్సరా!" అన్నాను.

"థ్యాంక్స్ దేనికిరా! నేను నీకు థ్యాంక్స్ చెప్పాలి" అన్నాడు.

"దేనికిరా" అన్నాను ఆశ్చర్యంగా.

"దేనికంటే చెబుతాను విను. నిన్న సాయంత్రం యాభై రూపాయల నోటిచ్చి ఒక సిగిరెట్ పాకెట్ కొన్నాను. వాడిచ్చిన చిల్లర రెండు ఇరవై రూపాయల నోట్లు, ఒక అయిదు రూపాయల నోటు. ఉదయం నా భార్య బ్యాంకుకెడుతూ చిల్లర కోసం నాదగ్గరున్న డబ్బు తీసి "ఇదేమిటండీ, దొంగనోటు" అంటూ ఒక ఇరవై రూపాయల కాగితం పైకెత్తి చూపింది. అప్పుడు గుర్తుకొచ్చింది నేనెక్కడో పప్పులో కాలేశానని. అది సిగరెట్ బంకు వాడిచ్చింది. వెంటనే చించేయబోయింది. నేను "తర్వాత చించేస్తానులే" అంటూ నాభార్యను అలా పంపి ఇలా రోడ్డున పడ్డాను. ఇంతలో నువ్వు పిలవడం, ఇరవై రూపాయల నోటు కాంటీన్ వాడికి అంటగట్టడం జరిగిపోయింది. ఇకపద ఆలస్యం అమృతం, విషం". నా దగ్గర వీడ్కోలు తీసుకుని వడివడిగా వెళ్లిపోయాడు.

నేను మార్కెట్ వైపు అడుగులు వేస్తూ ఆలోచిస్తున్నాను. ప్రతి ఒక్కడూ జీవితంలో ఒకసారైనా ఏదో విధంగా పప్పులో కాలేసేవాడే. పూర్తిగా దిగబడిపోయిన తర్వాత గాని తెలియదు. తను ఎంత దారుణంగా మోసపోయాడో! మోసపోయిన వాడు ఊరుకుంటాడా! ఇంకొకటి చేత పప్పులో కాలేయిస్తాడు. అందుకే చినిగిపోయిన ఈ నోట్లను ఎవరికైనా అంటగట్టాలి అనుకుంటూ మార్కెట్‌లోకి నడిచాను ✹

**(ఆంధ్రప్రభ డైలీ, ఆదివారం, తేది 6-12-1992)**